క్లుప్తంగా

యోగా టీచర్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: మండలంలోని పీబీ దేవం గ్రామంలో ఉన్న ఆయుర్వేద అవగాహన ఆస్పత్రిలో యోగా టీచర్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆస్పత్రి డాక్టర్ కె.విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగా శిక్షణ ఇచ్చేవారు, యోగాలో పీజీ కోర్సు, డిప్లొమా అర్హత ఉండాలన్నారు. విద్యార్హతను బట్టి ప్రాధాన్యం ఉంటుందన్నారు. పురుషులకు నెలకు 32 గంటలు, మహిళలకు నెలకు 20 గంటలు యోగా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. యోగా శిక్షకులుగా ఎంపికైన వారికి గంటకు రూ.250 వంతున గౌరవ వేతనం ఇస్తారని తెలిపారు. ఆసక్తి కలిగిన యోగా టీచర్లు పీబీ దేవంలోని ఆయుర్వేద ఆస్పత్రిలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 81433 93544 నంబరుకు సంప్రదించాలన్నారు.

కమిషనర్ సేవలు అభినందనీయం



జాస్తి రామారావును సత్కరిస్తున్న సిబ్బంది

సామర్లకోట: రెండేళ్ల పాటు మున్సిపల్ కమిషనర్‌గా జాస్తి రామారావు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా రామారావు గుంటూరు బదిలీ అయ్యారు. పార్టీలకతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధిపై దృష్టి సారించారని వారన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ జాన్‌మోజెస్, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, మెప్మా సీటీ మిషన్ మేనేజరు సుజాత, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది కమిషనర్‌ను ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు.

30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఈఓ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏటా శ్రావణ మాసంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో భాగంగా ఈ నెల 30న ఆలయ ప్రాంగణంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు

కాకినాడ: డిపో పరిధిలోని కాకినాడ, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురంల్లోని ఖాళీ స్థలాలను లీజు ప్రాతిపదికన ఇవ్వనున్నట్టు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ చెప్పారు. డిపో ఆవరణలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 15 ఏళ్ల కాలానికి లీజుకు ఇచ్చేలా ఇప్పటికే టెండర్లు కూడా పిలిచామన్నారు. కాకినాడ పాత బస్టాండ్ వద్ద 4,017 చదరపు గజాలు, పెద్దాపురం మున్సిపల్ మార్కెట్ వద్ద 9,844 చదరపు గజాలు, పెద్దాపురం మున్సిపల్ మార్కెట్ వద్ద 5,654 చదరపు గజాలు, పెద్దాపురం కొత్త బస్టాండ్ వద్ద 206 చదరపు గజాలు లీజుకు ఇస్తామన్నారు. అలాగే పిఠాపురం బస్ స్టేషన్ వద్ద 1,824 చదరపు గజాలు, 1,516 చదరపు గజాలు ఇస్తామన్నారు. ఈ నెల 19న ప్రారంభమైన టెండర్ షెడ్యూల్ వచ్చే నెల 12వ తేదీ వరకు అవకాశం ఉందని చెప్పారు. ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ నెల 28వ తేదీ ఉదయం 11.30కు అవగాహన సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

26 నుంచి డీఎస్ఏలో జాతీయ క్రీడా వారోత్సవాలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): శాప్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో డీఎస్ఏ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 26న ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, హాకీ పోటీలు, ఉట్టి ఆట, 27న అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్; బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, పవర్ లిఫ్టింగ్, యోగా, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, చెస్, టెన్నిస్, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్, రైఫిల్ షూటింగ్ పోటీలు ఉంటాయన్నారు. 18–40, 41–60, 61–80 ఏళ్ల వారికి, 28న జూనియర్ కళాశాల స్థాయి విద్యార్థులకు క్రీడా పోటీలు జరుగుతాయని వివరించారు. 29న డీఎస్ఏలో జాతీయ క్రీడా దినోత్సవం జరుగుతుందని తెలిపారు. 30న డిపార్ట్‌మెంట్ క్రీడా పోటీల సెమీ ఫైనల్స్, 31న ఫైనల్స్, బహుమతులపంపిణీ ఉంటుందని తెలిపారు.

భారత్‌కు సాటి లేరెవ్వరూ..

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): అంతరిక్ష సాంకేతికలో భారత్ అంతర్జాతీయ స్థాయి లో ఖ్యాతిని గడించిందని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్ అన్నారు. ఆగస్టు 23 భారత జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ స్టార్స్ ఆధ్వర్యంలో శనివారం నారాయణ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో, సముద్ర రంగాల్లో ఇస్రో ఇప్పటికే అనేక ప్రయోగాలు చేసి మానవాళి జీవనానికి అవసరమైన అనేక విషయాలు కనుగొన్నట్టు వివరించారు.



మహిళా సిబ్బందికి రక్షణ అవసరం

ప్రభుత్వాస్పత్రిలో ఎక్కువ సమయం రోగుల వద్ద స్టాఫ్ నర్సులు, నర్సులు ఉండి సేవలు అందిస్తుంటారు. రాత్రి సమయాల్లో కూడా రోగుల వార్డులో నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. కోల్‌కతాలో జరిగిన సంఘటన అందరినీ కదిలించింది. ఆస్పత్రిలో పని చేసే సిబ్బందికి రక్షణ లేకపోతే పనిచేయడం చాలా కష్టంగా ఉంటుంది. ఆస్పత్రి గేట్ల నుంచి రోగుల వార్డుల్లోను సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల్లో మహిళలకు రక్షణ ఏర్పాట్లు పెంచాలి.

– ఎస్ లోవరాజీ, స్టాఫ్ నర్సు, సామర్లకోట



మహిళా డాక్టర్లకు భద్రత కల్పించాలి

మహిళా డాక్టర్లకు ప్రభుత్వం రక్షణ కల్పించకపోతే విధులు నిర్వహించడం కష్టం. కోల్‌కతా వంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. మహిళల రక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలి.



– రిచాశర్మ,
పీహెచ్‌సీ వైద్యాధికారి, నాగులపల్లి

కాలి పుండు.. బాధ మెండు

- వర్షాకాలంలో మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి
- సోకితే మూగ జీవాల విలవిల
- ముందుగా గుర్తించకుంటే మిగిలిన వాటికీ వ్యాప్తి



ఆర్‌బీ పట్నంలో మేత మేస్తున్న మేకలు, గొర్రెలు



గొర్రెకు వచ్చిన కాలిపుండు

పెద్దాపురం: వర్షాకాలం సీజన్ ఇది. ఈ సమయంలో మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని పశువైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెద్దాపురం మండలంలో 5,441 మేకలు, 10,165 గొర్రెలున్నట్టు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. మేతకు వెళ్లే మేకలు, గొర్రెల మందలు వర్షా కాలంలో తడవడం, మురికిగుంతలు, నిల్వ ఉన్న నీటిలో అధిక సమయం నిలిచిఉండడం వల్ల సూక్ష్మజీవులు వాటి కాళ్లను ఆశించడంతో వ్యాధి బారిన పడతాయి. అలాగే చిత్తడి నేలల్లో తిరగడం వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. దీనిని ముందుగా గుర్తించకుంటే, ఒక జీవికి వచ్చిన వ్యాధి త్వరగా మందలోని మిగిలిన వాటికి వ్యాపిస్తుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు సంబంధిత కాపరులు రైతు భరోసా కేంద్రా(ఆర్‌బీకే)ల్లో అందుబాటులో ఉన్న పశువైద్య సిబ్బందిని కానీ, పశువైద్య కేంద్రాల్లో వైద్యులను కానీ సంప్రదించాలి.

వ్యాధి లక్షణాలు ఇలా..

ఈ వ్యాధి సోకిన మేకలు, గొర్రెలు తొలుత నడకలో వెనుకపడతాయి. సరిగా నడవలేక ఇబ్బందులు పడతాయి. అలాంటప్పుడు వాటి గిట్టలను పరిశీలించాలి. గిట్టల మధ్య ఎర్రగా కందినట్టు ఉంటే, కాలిపుండు వచ్చినట్టు గుర్తించాలి. ఈ వ్యాధి సోకిన జీవాలు సరిగా మేత మేయవు. బరువు తగ్గుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిన భాగం ఉబ్బి చీము పడుతుంది. అలాగే తీవ్రమైన దుర్వాసన వస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి గిట్టలు ఊడిపోయే ప్రమాదమూ ఉంది.

నియోజకవర్గంలో మేకలు, గొర్రెల వివరాలు

మండలం	మేకలు	గొర్రెలు
పెద్దాపురం	5,441	10,165
సామర్లకోట	3,179	9,759
మొత్తం	8,620	19,924

చికిత్స ఇలా..

ఈ తరహా వ్యాధి లక్షణాలు మేకలు, గొర్రెల్లో గుర్తిస్తే తక్షణమే స్పందించాలి. వ్యాధి సోకిన గిట్టలను 10 శాతం మైలతుత్తం ద్రావణం (కాపర్ సల్ఫేట్) లేదా 10 శాతం జింకు సల్ఫేట్ ద్రావణం లేదా 10 శాతం పోటాషియం పర్మాంగనేట్ లేక 5 శాతం ఫార్మలిన్ ద్రావణంలో నడిపించి, వాటి కాళ్లను శుభ్రం చేయాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేయడం వల్ల ఫలితం ఉంటుంది. వైద్యుల సూచనల మేరకు యాంటీ బయాటిక్ మందులను దాదాపు నెల రోజుల వరకు పూత పూయాలి. అలాగే అదనంగా పెరిగిన గిట్టలను కత్తిరించాలి.

నివారణ మార్గాలివీ..



మేకలు, గొర్రెల్లో కాలిపుండు వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే, వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరుచేయాలి. మందలను చిత్తడి, నీరు నిలిచే నేలలకు దూరంగా ఉంచాలి. మందను కాసే ప్రదేశాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలి. ఎప్పటికప్పుడు వైద్యుల సూచనల మేరకు మందులు వేయాలి.

– డాక్టర్ కె.రాకేష్,
ప్రభుత్వ పశు వైద్యశాల, ఆర్‌బీ పట్నం

శృంగార వల్లభుడి ఆలయానికి భక్తుల రద్దీ

ఒక్కరోజే రూ.2.04 లక్షల ఆదాయం



స్వామివారి దర్శనానికి క్యూలో నిలబడిన భక్తులు

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం శనివారం కావడంతో ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో స్వామి వారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు పూలమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.2,04,008 ఆదాయం సమకూరినట్టు ఈఓ శ్రీనివాస్ తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, భక్తులకు ప్రసాద వితరణ అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఈఓ తెలిపారు. సుమారు మూడు వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

360 కోణాల్లో పట్టణాభివృద్ధి

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య



బాధ్యతలు చేపట్టిన కమిషనర్ శ్రీవిద్యకు అభినందనలు తెలుపుతున్న సచివాలయ కార్యదర్శులు

సామర్లకోట: పట్టణాన్ని 360 కోణాల్లో అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానని కొత్త మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. కొత్త కమిషనర్‌గా శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా భీమవరంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న శ్రీవిద్యను సామర్లకోట కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన జాస్తి రామారావు ఆమెకు అభినందనలు తెలిపారు. మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులను ఆయన పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రమైన సామర్లకోటను తయారు చేస్తానన్నారు. ఈ మేరకు మున్సిపల్ కౌన్సిల్, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ప్రజలతో సమన్వయం చేసుకుంటూ, తన విధులను సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. మొదటగా పల్నాడు జిల్లా తాడేపల్లిలో మున్సిపల్ కమిషనర్‌గా, తర్వాత భీమవరం అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తూ, సామర్లకోటకు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చానన్నారు. మున్సిపల్ మేనేజర్ అచ్యుతరావు, డీఈ ఎ.అనంతలక్ష్మి, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు ఆమెకు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన కమిషనర్

మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎ శ్రీవిద్య శనివారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను కలిశారు. అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసినట్టు ఆమె చెప్పారు.

హాస్టళ్ల వసతులపై నిర్లక్ష్యం తగదు

తహసీల్దార్, కమిషనర్ హెచ్చరిక



పెద్దాపురం చిల్డ్రన్ హోమ్‌లో వసతులపై ఆరా తీస్తున్న తహసీల్దార్, కమిషనర్

పెద్దాపురం: ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్ల విద్యార్థుల వసతులు, రక్షణ చర్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని మండల తహసీల్దార్ వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ పద్మావతి అన్నారు. స్థానిక పద్మనాభ కాలనీలోని గ్రేస్ చిల్డ్రన్ హోమ్‌లో శనివారం రాత్రి వారు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహ విద్యార్థుల వసతులు, ఆహార నియమాల్లో తేడాల కారణంగా పలు చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అటువంటి పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయా వసతి గృహ అధికారులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ వెంకటలక్ష్మి మండలంలోని ఆనూరులో ఉన్న అనాథాశ్రమంలో తనిఖీలు నిర్వహించారు.

శ్రీవారి జపయజ్ఞ పారాయణ

బోట్‌క్లబ్: వేంకటేశ్వరుని గోవింద నామాలతో ఆరాధన చేయడం ఆధ్యాత్మిక యోగమని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. శ్రీవారి 46వ జపయజ్ఞ పారాయణగా భోగి గణపతి పీఠంలో శ్రీదేవి భూదేవి సమేత సహస్ర గోవింద నామ సంకీర్తన పూజా కార్యక్రమాలు శనివారం నిర్వహించారు.

ఉల్లి ధరలు నియంత్రించాలంటూ ఆందోళన



గొల్లప్రోలులో ఆందోళన చేస్తున్న అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు

పిఠాపురం: ఉల్లిపాయల ధరలు భారీగా పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు విమర్శించారు. ఉల్లిపాయల ధరలు నియంత్రించాలని కోరుతూ శనివారం ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు డి.నారాయణమూర్తి ఆధ్వర్యంలో గొల్లప్రోలులో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ ఉల్లిపాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం చూస్తుంటే ఉల్లి వ్యాపారులకు అండగా ఉంటుందని అనుమానం కలుగుతోందని ఆరోపించారు. కూరగాయల ధరలు పెరిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉల్లిని గొడౌన్లలో నిల్వ చేసి సామాన్యులు, మధ్యతరగతి, పేదప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇసుక ఉచితం అని చెప్పి ఇళ్ల నిర్మాణదారులకు చుక్కలు చూపిస్తోందని వివరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉల్లిపాయలు, కూరగాయలు, నిత్యావసరాలు, ఇసుక ధరలు తగ్గించాలని కోరారు. లేకుంటే దశల వారీగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు గుడాల చార్లెస్, వేగిశెట్టి గణేష్, కేశవరపు వీరబాబు, గొర్ల శివ, నాగమళ్ల శంఖర్ మాదేపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి



వెంకటేష్

కొత్తపల్లి: గణపతి నవరాత్ర మహోత్సవాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక ఎస్సై వెంకటేష్ సూచించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో ఏర్పాటు చేసే మండపాలకు ఆలయ కమిటీ సభ్యులు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలన్నారు. మైక్ అనుమతి తప్పనిసరి అన్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాలు, నిమజ్జనం తదితర విషయాలను కమిటీ సభ్యులు రాతపూర్వకంగా తెలియపరచాలన్నారు. ఉత్సవాల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజలు, వాహన చోదకులకు ఇబ్బందులు కలుగకుండా గణపతి మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల లోపు మైక్‌లు నిలుపుదల చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చోరీలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలిపారు. కొంతమంది యువకులు బృందంగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా షాపులు, మార్కెట్, ఆలయాలు, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

ఎంపీడీఓకు ప్రజాప్రతినిధుల సత్కారం



శ్యామ్‌సుందర్ దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ సత్తిబాబు, ఎంపీడీఓ శ్రీలలిత తదితరులు

సామర్లకోట: ఎన్నికల బదిలీల్లో భాగంగా విశాఖ జిల్లా నుంచి వచ్చిన ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్‌సుందర్ తక్కువ సమయంలో మండలంపై పట్టు సాధించి అందరి మన్ననలు పొందారని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. ఎన్నికల నేపథ్యంలో బదిలీ అయిన ఎంపీడీఓలను ఎక్కడి వారిని అక్కడే ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో శనివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ డి శ్రీలలిత అధ్యక్షతన బదిలీ అయిన ఎంపీడీఓ శ్యామ్‌సుందర్‌ను సత్కరించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలోను, మండల పరిషత్ సమావేశాల నిర్వహణలోను శ్యామ్‌సుందర్ వ్యవహరించిన తీరును కొనియాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పురస్కారాలు పొందిన సచివాలయ కార్యదర్శులు బొమ్మిటి రాధ, కొట్టే ప్రసన్నను సత్కరించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో గొంచాల గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలకు చెందిన రెండో తరగతి విద్యార్థి ఇంగ్లిష్‌లో జాతీయ నాయకుల జీవిత చరిత్రలను అనర్గళంగా చెప్పి సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన కొల్లా జీవన్‌కుమార్‌ను ఎంపీపీ సత్తిబాబు, ఎంపీడీఓ శ్రీలలిత ఘనంగా సత్కరించారు. ఎంఈఓలు వై శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి కృష్ణాష్టమి వేడుకలు



సామర్లకోటలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు



ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 27 నుంచి కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అర్చకుడు విజయజనార్దనాచార్యులు శనివారం తెలిపారు. ఈ నెల 29 వరకూ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 27న కృష్ణాష్టమి సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్ర పుష్పార్చన నిర్వహిస్తామన్నారు. 29న ఉదయం 8 గంటలకు మాస కల్యాణం, రాత్రి 7 గంటలకు ఉట్టు కొట్టే సంబరం, గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చిన్నారుల నృత్య ప్రదర్శనలు

సామర్లకోట: కృష్ణాష్టమిని పురస్కరించుకుని ముందుగా ఆయా ప్రైవేటు పాఠశాలల్లో చిన్నారులతో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. స్థానిక ప్రతిభా విద్యా నికేతన్‌లో పాఠశాల డైరెక్టరు ఎస్‌వీవీజీఎస్ ప్రకాష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కృష్ణుడు, గోపికల వేషాలతో ఉన్న చిన్నారులతో నృత్య ప్రదర్శనలు చేయించారు. అలాగే భాష్యం పాఠశాలలో చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



డీఎఫ్ఓ భరణిని సత్కరిస్తున్న ప్రముఖులు

- జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకేలో వ్యక్తిత్వ వికాసం–అభిరుచులు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవిత కాలం విద్యార్థి అని, జ్ఞాన నేత్రంతో ప్రపంచాన్ని చూడాలన్నారు. అందం అనేది మన గమ్యంలో ఉండదని, అది మన జీవన ప్రయాణంలో ఉంటుందన్నారు. ఉన్నత లక్ష్యాలను సాకారం చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. కాకినాడ జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి మాట్లాడుతూ కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి జాతీయ పతాకాన్ని ఎగురవేశానని, ఆ విజయం మహిళలకు అంతకితమిచ్చానన్నారు. అలాగే యూరప్‌లో అతి పెద్దదైన రష్యాలోని ఎల్బ్రస్ పర్వతాన్ని ఎంత ఒత్తిడి ఎదురైనా చిరునవ్వుతో అధిరోహించానన్నారు. కళాశాల స్థాయిలో విద్యార్థులకు ఎన్నో అవకాశాలు ఉంటాయని, వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రంపచోడవరం డీఎఫ్ఓ నరేంద్రన్, మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, డైరెక్టర్ రత్నకుమారి, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ సుగుణారెడ్డి, ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు సీమకుర్తి సురేఖ, మురళీ, డాక్టర్ బాదం బాలకృష్ణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాండ్రకోటలో పశు వైద్య శిబిరం

పెద్దాపురం: స్వచ్ఛంద సంస్థలు పాడి రైతులకు అందజేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాండ్రకోట పశువైద్యాధికారి తోట నవీన్ అన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కాండ్రకోట పశు వైద్యశాలలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ మేనేజర్ బఱ్ఱే నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ నవీన్ మాట్లాడారు. ఈ సందర్భంగా పలు పశువులకు గాలికుంటు టీకాలు, గర్భకోశ చికిత్స చేశారు. లేగ దూడలకు డీ వార్మింగ్ మందులు, పశువులకు మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు.

నేడు దుర్గా మల్లేశ్వరస్వామి జాతర ఉత్సవం



దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం

సామర్లకోట: నవర గ్రామంలో ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం జాతర మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త, ఎంపీటీసీ కేసావరపు ప్రభాకరరావు తెలిపారు. ఆలయం స్థాపించి 48 ఏళ్లయిన సందర్భంగా 48వ జాతర ఉత్సవాలను ఈ నెల 19 నుంచి ప్రారంభించామని తెలిపారు. నిత్యం ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆదివారం సాయంత్రం జాతర ఉత్సవం ఉంటుందన్నారు. సాయంత్రం బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పులతో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై వివిధ రకాల వేషధారణతో జాతర ప్రారంభమవుతుందని వివరించారు. భక్తులు పాల్గొనాలని ఆలయ కార్యదర్శి వేగిశెట్టి గోవిందరావు, తోట గోపి కోరారు.